సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



రాజన్న చెంత ఉపాధి

మహాశివరాత్రి జాతర సందర్భంగా వ్యాపారులు సిద్ధం అవుతున్నారు. బిజినెస్ బాగా కావాలని కోరుకుంటున్నారు. 8లో▸



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే

వేములవాడ: వేములవాడ రాజన్నను స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు– మరియ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అనంతరం కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మల ఆధ్వర్యంలో అర్చకుల బృందం వీరికి ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణల అనంతరం శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అద్దాల మంటపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు కొత్త సొగసులు



మాట్లాడుతున్న ఆకునూరి శంకరయ్య

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని వివిధ శాఖా గ్రంథాలయాలను నవీకరించేందుకు నిర్ణయించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. గంభీరావుపేట మండలకేంద్రంలో ఇటీవల ప్రారంభమైన కేజీ టు పీజీ భవన సముదాయంలోని విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి గ్రంథాలయాన్ని రోజుకు 12 గంటలపాటు తెరిచి ఉంచుతామని, ఇద్దరు భద్రతా సిబ్బందిని నియమిస్తామని అన్నారు. కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలోని అన్ని శాఖాగ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలు తెప్పించనున్నట్లు వెల్లడించారు. ముస్తాబాద్‌లోని గ్రంథాలయ భవన నిర్మాణానికి తీర్మానించామన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, గ్రంథ పాలకులు శంకరయ్య, కమటం మల్లయ్య పాల్గొన్నారు.

జంగంరెడ్డిపల్లిలో నేషనల్ వాటర్ అవార్డ్ బృందం



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న బృందం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం నేషనల్ వాటర్ అవార్డ్ బృందం సభ్యులు పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికి నిర్మాణం చేసిన ఇంకుడు గుంతలు, గ్రామపంచాయతీ, ఇతర సామూహికస్థలాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలన చేశారు. ఇల్లంతకుంట సబ్‌స్టేషన్‌లో బోర్‌వెల్‌ను పరిశీలించి వాటర్‌లెవల్‌ను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వాటర్ అవార్డ్ బృందం సభ్యులు సుధీర్‌కుమార్, ఫ్రాంక్లిన్, అదనపు డీఆర్డీఓ మదన్‌మోహన్, సర్పంచ్ శ్రీలత, ఏపీడీ నర్సింహులు, ఏపీఓ చంద్రయ్య , తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్పొరేట్‌స్థాయి విద్యకు కృషి



పనులు పరిశీలిస్తున్న తోట ఆగయ్య

వీర్నపల్లి(సిరిసిల్ల): ప్రతి పేదకుటుంబంలో విద్యా కుసుమాలు వెలగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు బుధవారం పరిశీలించారు. మారుమూల ప్రాంతంలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో కార్పొరేట్‌స్థాయిలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు మండలకేంద్రంలోని పెద్దవాగుపై వంతెన పనుల్లో నాణ్యత లోపిస్తుందని సీపీఐ రైతు విభాగం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య ఆగయ్య దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ఆర్అండ్‌బీ ఈఈకి ఫోన్ ద్వారా సమస్యను తెలియజేశారు. సర్పంచ్ పాటి దినకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కళ, ఉపసర్పంచ్ బోయిని రవి, మండల కో– ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ ఉన్నారు.

సీఎంకు ఘనస్వాగతం.. సన్మానం

- నాచుపల్లి జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సీఎం దిగగానే.. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు.
- బస్సు నుంచి దిగాక.. ప్రధాన ఆలయంలోకి ప్రధాన పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- అనంతరం ఆలయ పరిసరాలను సీఎం కలియ తిరిగారు. ప్రతీ నిర్మాణం గురించి వాస్తు నిపుణులను అడిగారు.
- ఇక ఆలయ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి మ్యాపులను స్వయంగా పరిశీలించారు. అందులోని పలు నిర్మాణాల విషయంలో సూచనలు చేశారు.
- దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. కొండగట్టు ఆలయ చిత్రాన్ని బహూకరించారు.



సీఎం కేసీఆర్‌కు అంజన్న చిత్రపటం అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇక అంజనాద్రిగా కొండగట్టు

యాదాద్రి తరహాలో అభివృద్ధి, పునర్నిర్మాణం



అంజన్నకు మొక్కులు చెల్లించుకుని బయటకు వస్తున్న సీఎం కేసీఆర్

- ఆలయాభివృద్ధి ఖర్చుకు వెనకాడనన్న సీఎం
- పనులు పూర్తయ్యే వరకు వస్తూనే ఉంటా
- భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దు
- మాల విరమణ దీక్షాపరులకు ప్రత్యేక సదుపాయాలు
- కాటేజీల నిర్మాణానికి ముందుకు వచ్చిన మంత్రి గంగుల
- రెండుగంటలు ఆలయాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కొండగట్టు: యాదాద్రి తరహాలో కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం కొండగట్టు ఆలయం అభివృద్ధి, విస్తరణ మాస్టర్‌ప్లాన్ తదితరాలపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో హెలీక్యాప్టర్‌లో కొండగట్టుకు వచ్చిన సీఎం .. జేఎన్టీయూ హెలీప్యాడ్ నుంచి నేరుగా బస్సులో నేరుగా ప్రధానాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉదయం 11.25 నుంచి 12.05 గంటల వరకు జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- మ.12.15 గంటల నుంచి మ.2.20 నిమిషాల వరకు ఆలయం, పరిసరాల్లో భక్తుల కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై పండితులు, వాస్తు, ఇంజినీరింగ్ నిపుణులు, మిషన్‌భగీరథ, అటవీ, పర్యాటక శాఖ, దేవాదాయ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.
- ఆలయ అభివృద్ధికి ఖర్చు విషయంలో వెనకాడేది లేదని, ఇప్పుడు విడుదల చేసిన రూ.100 కోట్లకు మరో రూ.1000 కోట్లయినా ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని సీఎం స్పష్టంచేశారు. ఆగమశాస్త్రం ప్రకారం.. వాస్తు నియమాలకు అనుగుణంగా యాదాద్రి తరహాలో అంజనాద్రిగా తీర్చిదిద్దడమే ధ్యేయమని స్పష్టం చేశారు.

క్యూలైన్లు విస్తరించాలి..

సమావేశం ప్రారంభంలోనే.. దేవాలయాన్ని భక్తుల అవసరాలకు అనుగుణంగా విస్తరించడానికి సేకరించాల్సిన భూములు, సంబంధించిన అంశాలపై లొకేషన్ మ్యాపులను సీఎం పరిశీలించారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. శని, మంగళవారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు విస్తరించాలన్నారు.

- భక్తుల కోసం గుట్ట మీద కాటేజీల నిర్మాణానికి దాతలను ఆహ్వానించాలన్నారు. ఇప్పటికే శ్వేత గ్రానైట్స్ వారు నిర్మించిన కాటేజ్.. విస్తరణలో పోతున్నందున దాన్ని తిరిగి నిర్మిస్తామని మంత్రి గంగుల కమలాకర్ ముందుకు వచ్చారు. అందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. మంత్రి చొరవను సీఎం అభినందించారు. కళ్యాణ కట్ట దగ్గర పుష్కరిణిలు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ కట్ట పుష్కరిణి పక్కపక్కన ఉండటంతోపాటు స్త్రీలు, పురుషులకు ప్రత్యేక పుష్కరిణులు ఏర్పాటు చేయాలన్నారు. కొండగట్టులోని అటవీ సంపదను పరిరక్షించేలా బందీపూర్ అభయారణ్యం తరహాలో గుట్టపై అడవిని వృద్ధి చేయాలన్నారు. ఆలయ స్థల పురాణం పుస్తకాలను ముద్రించాలని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల స్థల పురాణ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కొండపైకి వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఘాట్‌రోడ్డును విస్తరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.
- సమీక్ష సమావేశంలో మంత్రులు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమాలకర్, ఎంపీ దివకొండ దామోదర్ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సంజయ్, కె.విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మండలి చీఫ్ విప్ భాను ప్రసాద రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ యాస్మిన్ భాషా, ఆలయ స్తపతి ఆనందర్ సాయి, వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఆలయ ఈఓ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు, భక్తులకు నో ఎంట్రీ..!

సీఎం పర్యటన సందర్భంగా గుట్టపైన భద్రత కట్టుదిట్టం చేశారు. కేవలం కొండగట్టులో పనిచేసే దేవాదాయ, శానిటేషన్ సిబ్బంది మినహా గుట్టపై వ్యాపారులను సైతం అనుమతించలేదు. భక్తులకు గుట్ట మీదకు ప్రవేశం లేదన్న సంగతి తెలియక మధ్యాహ్న వరకు కిందనే ఇబ్బందులు పడ్డారు. చివరికి మీడియాకు సైతం ప్రవేశం లేకపోవడం గమనార్హం. మంగళవారం సాయంత్రమే గుట్టపై ఉన్న వారిని ఖాళీ చేయించారు. రాత్రి నుంచి గుట్టను పోలీసులు పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో దాదాపు 2,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ రమేశ్‌నాయుడు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, మరో ఇద్దరు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 150 మంది ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందు రోజు అర్ధరాత్రి వరకు సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, కలెక్టర్ యాస్మిన్ భాషా కొండపై సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

అంజన్న ఆలయ అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



సుంకె రవిశంకర్

కొండగట్టుకు సీఎం కేసీఆర్ వచ్చి వెళ్లడం చాలా సంతోషమని.. సూర్యచంద్రులు ఉన్నంత వరకు చంద్రశేఖరుడుంటాడని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. 600 నుంచి వెయ్యి కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొండగట్టు ఆలయాన్ని చరిత్రలో నిలిచిపోయేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. పదిరోజుల్లో కరీంనగర్ వచ్చి ఆలయానికి మరోసారి కేసీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం సారొచ్చారని..

- భక్తులకు కొండపైకి అనుమతి ఇవ్వని అధికారులు
- దిగువ కొండగట్టులో హనుమాన్ విగ్రహానికి మొక్కులు

ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు పర్యటన సందర్భంగా పోలీసుల, అధికారుల ఆంక్షలతో సాధారణ భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచే పోలీసులు కొండగట్టును మొత్తం తమ ఆధీనంలోకి తీసుకోగా.. కొండపైకి ఇతరులను, భక్తులను అనుమతించలేదు. దిగువ కొండగట్టులో బారికేడ్లు ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లేవారిని అడ్డుకున్నారు. సీఎం పర్యటన విషయం తెలియక అంజన్న దర్శనానికి కొండగట్టు వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు ఎండకు అలమటించారు. అంజన్న దర్శనానికి అవకాశం లేకపోవడంతో దిగువ కొండగట్టు బస్టాండు వద్ద ఉన్న హనుమాన్ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి.. వెనుదిరిగారు.



భక్తులు కొండపైకి వెళ్లకుండా పోలీసు బందోబస్తు



హనుమాన్ విగ్రహానికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

- జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ అరుణ, తదితరులు

సిరిసిల్లటౌన్: గిరిజనుల అభివృద్ధికి బీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. బుధవారం సిరిసిల్ల శివారులోని పెద్దూరులో సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన తండాల్లో విద్యా, వైద్యం, తాగునీరు, సాగునీరు, మౌలిక వసతులను పూర్తిస్థాయిలో రాష్ట్ర సర్కారు కల్పిస్తోందని అన్నారు. జిల్లా కేంద్రంలో ఎకరం స్థలంలో రూ. 1.10కోట్లతో బంజారా భవన్ నిర్మాణం అవుతోందని అన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వీర్నపల్లి జెడ్పీటీసీ గుగులోతు కళావతి సురేశ్, ఉత్సవ కమిటీ కన్వీనర్ సురేశ్‌నాయక్, జిల్లా బంజారా సంఘం అధ్యక్షుడు అజ్మీరా రాజునాయక్, కౌన్సిలర్లు రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయవద్దు

సిరిసిల్లఎడ్యుకేషన్: పదోతరగతి పబ్లిక్‌పరీక్షలకు రెండు నెలలు ఉందని సమయం వృథా చేయకుండా అభ్యసనపై దృష్టి సారించి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి డి.రాధాకిషన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని బుధవారం సిరిసిల్ల పట్టణం కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి అత్యధికసంఖ్యలో 10జీపీఏ సాధించాలని సూచించారు. పరీక్షల విభాగం కార్యదర్శి ఎండీ.అజీత్, డీసీబీ కార్యదర్శి శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి, ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, 29వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ దేవయ్య, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మల్లార పురుషోత్తం ఉన్నారు.

శివార్చనలో 41 కార్యక్రమాలు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 17న నుంచి జరిగే మహాశివరాత్రి జాతర మహోత్సవాల శివార్చన కార్యక్రమంలో 41 కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసినట్లు సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కళోత్సవాలు 18న ఉదయం 6 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. భక్తులకు జాగరణతో ఆహ్లాదం పంచేందుకు రూ.కోటితో ప్రత్యేక ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మహాశివరాత్రి పనులు ముమ్మరం







వేములవాడ: మహాశివరాత్రి జాతరకు వేములవాడ రాజన్న క్షేత్రం ముస్తాబు అవుతోంది. ఒక్కరోజే సమయం ఉండడంతో మిగిలిపోయిన పనులు వేగంగా పూర్తి చేసేలా అధికారులు సన్నద్ధం అయ్యారు. ఈ మేరకు ఆలయాలకు రంగులు, షామియానాలు, పందిర్లు వేస్తున్నారు. విద్యుత్ లైట్లు అమర్చుతున్నారు. బారికేట్లు ఏర్పాటు చేస్తున్నారు. పలుచోట్ల రోడ్లు, ఇతర మరమ్మతులు చేస్తున్నారు. గురువారం సాయంత్రం నాటికి పనులన్నీ పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా.. ఈనెల 17 నుంచి రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతరకు రాష్ట్ర దేవాదాయశాఖ రూ.3.70 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

మహాజాతరకు భారీ భద్రత

- విధుల్లో 2 వేల మంది పోలీసులు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- నేటి నుంచి 19 వరకు బందోబస్తు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి 19వరకు వైభవంగా జరిగే మహాశివరాత్రి వేడుకలకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ భద్రత చర్యలు తీసుకుంటున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతోపాటు వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. భక్తుల భద్రతకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2 వేల మందిని వినియోగిస్తున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

మహాశివరాత్రి వేడుకలకు వేములవాడ పట్టణంతోపాటు రాజన్న ఆలయంలో మొత్తంగా 600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాతో వేడుకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆరెపల్లి, రగుడు, కోనాయపల్లి, శాత్రాజుపల్లి, వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద మొత్తం ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. బందోబస్తులో పాల్గొనే పోలీసులు ఈ నెల 16వ తేదీ సాయంత్రమే రిపోర్టు చేసి 19న తిరిగి వెళ్లనున్నారు. పోలీసులకు పోలీస్‌స్టేషన్‌లో భోజనం ఏర్పాటు చేయనున్నారు. రాజన్న గుడి కట్ట మీద రాజన్న ఆలయానికి వచ్చే వాహనాల కోసం 11 పార్కింగ్ సెక్టార్లుగా ఏర్పాటు చేయనున్నారు. జగిత్యాల రూట్‌లోని సాయిరక్ష దాబా వద్ద హెవీ వెహికిల్స్ కోసం పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు.



సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్ (ఫైల్)

వాహనాల రద్దీని బట్టి మహాశివరాత్రి రోజున వేములవాడ– నాంపల్లి రహదారిని ఎగ్జిట్ వేగా చేయనున్నారు. కరీంనగర్ నుంచి వేములవాడకు వచ్చే వాహనాలను నందికమాన్ మీదుగా మళ్లించనున్నారు. మహాశివరాత్రికి మూడు రోజులపాటు, పోలీసు పెట్రోలింగ్ వాహనాలు, షీటీమ్స్, క్రైమ్ పార్టీ టీమ్‌లు తిరగనున్నాయి. రాజన్న అనుబంధ దేవాలయాలు నాంపల్లి, అగ్రహారం ఆలయల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

భారీ బందోబస్తు

వేములవాడ రాజన్న ఆలయంలో మహాశివరాత్రికి భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. వాహనాల పార్కింగ్, క్యూలైన్‌ల ఏర్పాటు చేస్తున్నాం.

– వెంకటేశ్, వేములవాడ టౌన్ సీఐ

తెలంగాణలో నియంత పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ/వేములవాడరూరల్: రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో బుధవారం శక్తికేంద్రం ఆధ్వర్యంలో స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు, నియామకాలు, నిధుల పేరిట గద్దెనెక్కి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కల్వకుంట్ల కుటుంబానికే పదవులు ఇచ్చి సొంత రాజ్యాంగంగా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి మొదలుకుని 90శాతం వరకు వాటా కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి నందగిరి రాహుల్, మండల ఉపాధ్యక్షుడు ఎగుర్ల అనిల్, గడ్డం రాజశేఖర్, బారాజు కిషన్‌రెడ్డి, గుంటి వంశీ, వెంకటేశ్ ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలు, వారి వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. పట్టణంలోని అంజనీనగర్‌లో శక్తికేంద్రం ఇన్‌చార్జి అన్నారం శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం చేపట్టిన స్ట్రీట్ కార్నర్ కార్యక్రమంలో మాట్లాడారు. వేములవాడ రాజన్నకు రావాల్సిన నిధులు రాలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. మాజీ సెస్ చైర్మన్ అల్లాడి రమేశ్, కౌన్సిలర్ ముప్పిడి సునంద, నాయకులు గోపు బాలరాజు, రేగుల సంతోశ్‌బాబు, సంటి మహేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి


తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

సిరిసిల్లటౌన్: ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదేశించారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు బుధవారం సిరిసిల్లలోని పలు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టింది. ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం నిర్వహించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తనిఖీల్లో కమిటీ సభ్యులు డాక్టర్ రజిత, చింతోజు భాస్కర్, జలపతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


దీక్షలను ప్రారంభిస్తున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి. స్కైలాబ్‌బాబు అన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న డిమాండ్‌తో మూడు రోజులుగా సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ఎదుట చేపడుతున్న రిలే దీక్షలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన పేదలకు డబుల్‌బెడ్రూం జాబితాలో పేర్లు లేని వారికి నివేశన స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం చేపడ్తామని హెచ్చరించారు. నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, శ్రీధర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న హన్మండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. బుధవారం గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో నిర్వహించిన జమైత్ ఉలామహి హింద్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్వేశాలు రెచ్చగొట్టే వారిపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మౌలానా అర్షద్ మదాని, జుబేర్, ఫహీమ్, మౌలానా అబుల్ కలాం, ఇర్ఫాన్, గౌసోద్దీన్, సలీమ్, సర్పంచ్ అక్కపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.


ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యాపారి పేరు బొంద్ల లావణ్య. 30 ఏళ్ల నుంచి అత్తమ్మ బుజ్జమ్మతో కలిసి కంకణాలు, దారాలు అమ్ముకుంటూ ఉపాధి పొందారు. ఇప్పుడు కోడలు లావణ్యతో ఆలయం ఎదుట బండిపైనే ఉపాధి పొందుతోంది. ప్రస్తుతం జాతర ఉత్సవాలకు అన్ని సిద్ధం చేసినట్లు తెలుపుతోంది.


ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ సుజాత. 35 ఏళ్లుగా రాజన్న ఆలయ ఆవరణలో బండిపై తన భర్తతో కలిసి స్వీట్లు అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు. జాతర ఉత్సవాలకు స్వీట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలుపుతోంది. రాజన్న చెంత ఉపాధి పొందుతుండటం సంతోషంగా ఉందని అంటోంది.


ఈచిత్రంలో కనిపిస్తున్న గిన్నె రవీందర్ 30 ఏళ్లుగా రాజన్న ఆలయం ముందు జనరల్‌స్టోర్ పెట్టుకొని జీవిస్తున్నారు. తన ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు కొత్త సామగ్రి తెచ్చినట్లు చెబుతున్నారు.

రాజన్న చెంత ఉపాధి

- మహా జాతరపై వ్యాపారుల సన్నాహాలు
- ఈనెల 17 నుంచి ఉత్సవాలు ప్రారంభం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ చెంత పలువురు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఏటా మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తులకు వారి అవసరాల మేరకు వస్తువులను అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే మహా జాతర ఉత్సవాల కోసం ఇప్పటికే వ్యాపారులు తమతమ దుకాణాలను సిద్ధం చేసుకుని ఉన్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా 50 ఏళ్లుగా ఇక్కడ ఉపాధి పొందుతున్న వ్యాపారుల మనోగతం,


రాజన్న ఆలయ ఆవరణలో వివిధ దుకాణాలు


ఈచిత్రంలో కనిపిస్తున్న పెద్దాయన హింగె లింగయ్య. సొంతూరు ఆరెపల్లి. 70 ఏళ్ల క్రితం వేములవాడకు వచ్చారు. 65 ఏళ్లుగా స్వామి వారి ఫొటోఫ్రేమ్‌లు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. ఎవరైనా వీఐపీలకు పెద్దపెద్ద ఫొటోలు ఇవ్వాలంటే ఇక్కడి నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుందని సంతోషంగా చెబుతున్నారు. జాతర మహోత్సవాలకు ఫొటోలు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. రాజన్న చెంతనే తమ జీవనం కొనసాగుతోందంటున్నారు.


ఈ ఫొటోలో కనిపిస్తున్న ఫొటోగ్రాఫర్ మ్యాన రాజయ్య. ఇతడిని ఫొటోగ్రాఫర్ రాజయ్యగా పిలుస్తుంటారు. సొంతూరు వేములవాడ కావడంతో ఇక్కడే ఫొటోస్టూడియో పనులు నేర్చుకున్నారు. 38 ఏళ్లుగా భక్తులకు ఫొటోలు దించుతూ ఆనందపరుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల పెళ్లిలు చేసి ఆనందంగా ఉన్నారు. రాజన్నే మాకు సర్వస్వమని తెలుపుతున్నాడు.


ఈ ఫొటోలో కనిపిస్తున్న కూనవేణి లక్ష్మి తన భర్త ఎల్లయ్యతో కలసి 55 ఏళ్లుగా కొబ్బరికాయలు, పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తోంది. తమ ఇంటిపేరు సైతం కొబ్బరికాయల ఎల్లయ్యగా నామకరణం వచ్చిందని చెబుతున్నారు. ఈసారి జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారని భావించి తమ దుకాణాలను సిద్ధం చేసి ఉంచుకుంటున్నట్లు తెలిపింది.

వాహన తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి శివారు, ఎల్లారెడ్డిపేట, దూమాల ఎక్స్‌రోడ్డు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపాలని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దుప్పి

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులోని గువ్వలబండా తండా ఆవరణలోని పంటపొలాలకు బుధవారం నీరు తాగేందుకు దుప్పి వచ్చింది. అక్కడ ఉన్న శునకాలు దుప్పిపై దాడికి యత్నించగా సమీపంలోని శివ స్వాములు గమనించి శునకాలను చెదరగొట్టారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

108 అంబులెన్సులో ప్రసవం

వీర్నపల్లి(సిరిసిల్ల): కోనరావుపేట మండలం మర్రిమడ్లకు చెందిన గర్భిణికి బుధవారం 108 సిబ్బంది ప్రసవం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మర్రిమడ్లకు చెందిన గర్భిణి గుంట రేఖకు పురుటి నొప్పులు రావడంతో వీర్నపల్లి మండలం 108 అంబులెన్సుకు ఫోన్ వచ్చింది. 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో సిరిసిల్ల చంద్రంపేట గ్రామశివారులో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. మెడికల్ టెక్నిషియన్ మధు అంబులెన్సులోనే పురుడు పోశారు. తల్లీ ఆడ బిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

అనుమానిత ప్రదేశంలో బీఆర్‌ఎస్ నేతలు

- తనిఖీ చేసిన పోలీసులు
- వాగ్వాదం చేసిన కౌన్సిలర్
- పోలీసుతీరుపై మంత్రి వద్దకు..?

సిరిసిల్లక్రైం: అనుమానిత ప్రదేశంలో పలు వాహనాలు ఆగి ఉండటం చూసిన పోలీసులు ఆ ప్రదేశంలో ఏం జరుగుతుందన్న తెలుసుకునేందుకు వెళ్లి, అధికార పార్టీ బీఆర్‌ఎస్ నేతలతో వాగ్వాదం జరిగిన ఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం స్థానికంగా చర్చ జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. రాజీవ్‌నగర్ నుంచి పెద్దబోనాల వెళ్లే దారిలో చాలా రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వద్ద పలు వాహనాలు నిలిపి ఉన్నాయి. అక్కడి మరో కారు నెమ్మదిగా చేరుకునే విధానాన్ని పోలీసులు గమనించారు. అనుమానిత కారులో ఎవరున్నారని గమనిస్తూ వాహనాలు ఉన్న స్థలానికి చేరుకున్నారు. పోలీసు వాహనానికి ముందు వెళ్లిన కారు లోపలికి వెళ్లేందుకు గేటు తాళం తీయడానికి వచ్చిన వ్యక్తి ఆ సమయంలో పోలీసు వాహనం రావడం చూసి తాళం తీయడం ఆపేశాడు. ఇలా చేయడంతో అనుమానం వచ్చిన పోలీసు అధికారి తాళం తీయాలని కోరడంతో తన వద్ద తాళం లేదని, లోపల ఉన్న ఓ సార్ వద్ద ఉందని వెళ్లడించి లోపలికి వెళ్లి ఓ కౌన్సిలర్‌ను తీసుకుని వచ్చాడు. అప్పటి వరకు తాళం తన వద్ద లేదని చెప్పిన వ్యక్తి జేబులోంచి తాళం చెవి తీయడం చూసిన పోలీసు అధికారి ఇదేం పద్ధతంటూ కౌన్సిలర్‌ను అడిగారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహించే పోలీసు అధికారులను నిలిపి ఉంచడం సరికాదని లోపల ఏం జరుగుతుందని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ పదుల సంఖ్యలో వ్యక్తులు మద్యం సేవించే పనిలో ఉన్నారు. అక్కడున్న వారి వివరాలను నమోదు చేసుకోవాలని సిబ్బందికి పైఅధికారి ఆదేశాలివ్వగా పక్కనే ఉన్న కౌన్సిలర్ వివరాలేమి నమోదు చేయవద్దని పోలీసులను అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తమకున్న వెంచర్‌లోని గదిలో ఉన్న తమను కావాలని కించపరిచారన్న ఆవేదనతో నేతలందరూ మంత్రి కేటీఆర్ వద్దకు బుధవారం వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. అసలు పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్న కౌన్సిలర్లు ఎందరు, తనిఖీలు చేసిన పోలీసు అధికారులెవరన్న దానిపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలోని పలువురు ఈవిషయాన్ని చర్చించుకుంటున్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

సిరిసిల్లటౌన్: విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే పరీక్షలంటే భయంతో కాకుండా ఇష్టంగా చదవాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ ధనాలకోట రాధాకిషన్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టు కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువులు సాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి ప్రశాంత్ నాయకులు ఆదిత్య, సాధిక్, శశి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈవో రాధాకిషన్

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): హత్య కేసులో మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన కారెంగుల శ్రీనివాస్‌కు యావజ్జీవ శిక్ష తోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఎం.నాగరాజు బుధవారం తీర్పు చెప్పినట్లు రామగుండం సీపీ ప్రకటనలో తెలిపారు. మంగపేటకు చెందిన కారెంగుల శ్రీనివాస్ 1-3-2021లో భూ తగాద విషయంలో అదే గ్రామానికి చెందిన కారెంగుల మల్లమ్మను ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో బాధితురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు రెంగుల రమేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు విచారించి నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. తదుపరి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి ఎం.నాగరాజు, నిందితుడు కారెంగుల శ్రీనివాస్‌కు యావజ్జీవ శిక్ష, జరిమానా విధించారు. నేరస్తుడికి శిక్ష పడటానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి సాక్షులను ప్రవేశపెట్టి తమ వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఎస్సై జి.రాజవర్ధన్, తదితరులను సీపీ రెమా రాజేశ్వరి, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ను అభినందించారు.

ఇద్దరి బైండోవర్


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం అమ్మకాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. వీర్నపల్లి బావోజి తండా, బంజేరు, గోలియా నాయక్ తండా, మద్దిమల్లలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించగా ఇద్దరు పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు భవిష్యత్తులో ఎలాంటి ఎక్సైజ్ నేరానికి పాల్పడమని తహసీల్దార్‌కు హామీ పత్రం రాసిచ్చారన్నారు.

యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేత

- సరిహద్దుల పేరిట పట్టించుకోని అటవీ శాఖ సిబ్బంది

చందుర్తి(వేములవాడ): రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సరిహద్దు గ్రామాలైన చందుర్తి–మోతుకులరావుపేట గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు యథేచ్ఛగా టేకు చెట్లను నరుకుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండు జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం కావడంతో అటవీ శాఖ సిబ్బంది తమ పరిధి కాదంటే తమ పరిధి కాదంటూ దాట వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్య రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం కలపను తీసుకెళ్తే జరిమానా విధించే అటవీ సిబ్బందికి భారీ టేకు వృక్షాలు నెలకొరుతున్నా కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువ టేకు కలపను స్మగ్లర్లు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలో తరలిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు నిఘా తీవ్రతరం చేసి అటవీ ప్రాంతాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై బీట్ అధికారి వినోద్‌ను వివరణ కోరగా అటవీ ప్రాంతంలోని చెట్లను నరికి వేస్తున్నారో, పట్టా భూముల్లో నరికి వేస్తున్నారో తెలుసుకుంటానని తెలిపారు.


నరికి వేతకు గురైన టేకు చెట్లు

నిశ్చితార్థం ఇంట్లో విషాదం

- హైదరాబాద్ నుంచి వస్తుండగా కారు ప్రమాదం
- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

గోదావరిఖని(రామగుండం): తెల్లవారితే నిశ్చితార్థం.. ఆ లోపే కారు ప్రమాదం రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ కుటుంబంలో విషాదం నింపింది. తమ్ముడి నిశ్చితార్థం కోసం గోదావరిఖని వస్తున్న క్రమంలో కారు ప్రమాదానికి గురై అన్న అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలైన ఘటన గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలో విషాదం నింపింది. స్థానికుల వివరాలు.. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి మాజీ కార్మికుడు తాటిపాముల రాజనర్సయ్య పెద్దకుమారుడు అరవింద్ (33) గృహ ప్రవేశం హైదరాబాద్‌లో ఉండగా, మూడురోజుల క్రితం అరవింద్, అతడి భార్య నవ్య, తల్లి కవిత, అత్తమ్మ భారతి, పిల్లలు హిమాన్స్, కృతికశ్రీ, సోదరుడు మహేశ్ కారులో వెళ్లారు. గురువారం గోదావరిఖనిలో మహేశ్ నిశ్చితార్థం ఉండడంతో బుధవారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని రోడ్డుకిందకు దూసుకెళ్లి మూడు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో అరవింద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలినవారిని 108లో ఆస్పత్రికి తరలించారు. మహేశ్‌కు తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నాడు. రాజనర్సయ్య భార్య చేయికి గాయమైంది. అరవింద్ భార్య వెన్నెముక దెబ్బతింది. తెల్లవారితే శుభకార్యం జరగాల్సిన ఇంట్లో ప్రమాదం చోటుచేసుకుని ఇంటి పెద్దకొడుకు మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. కాగా అరవింద్ ఇందారంఖని-1వ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు.


అరవింద్(ఫైల్)

బస్సులో రావడంతో ఇంటి పెద్దకు తప్పిన ముప్పు

హైదరాబాద్ వెళ్లేటప్పుడు అందరు కారులో వెళ్లినా.. తిరిగి వచ్చే సమయంలో కారులో ఇరుకుగా ఉండటంతో ఇంటి పెద్ద రాజనర్సయ్యను జూబ్లీహిల్స్ బస్టాండ్ వద్ద బస్సులో ఎక్కించారు. దీంతో ప్రమాదం నుంచి అతడు బయటపడ్డాడు.

తృటిలో తప్పిన ప్రమాదం


అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులోని రైస్ మిల్ ఆవరణలో బుధవారం రుద్రంగి నుంచి మానాలకు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న మట్టిలో దిగబడి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలోని శివస్వాములు కారును రోడ్డుపైకి లాగారు.

రెండు ఆలయాల్లో దొంగతనం

మెట్‌పల్లి(కోరుట్ల): జగ్గాసాగర్‌లోని రెండు ఆలయాల్లో దొంగతనం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు బ్రహ్మంగారి ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టారు. రామాలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. వాటిల్లో సుమారు రూ.80 వేల నగదు ఉన్నట్లు తెలిపారు. ఆలయాలను పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు

వివాదంతో చెరువులోని నీరు తొలగింపు

వీర్నపల్లి(సిరిసిల్ల): చేపల వివాదంతో చెరువులోని నీటిని తొలగించిన సంఘటన వీర్నపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వీర్నపల్లి సమీపంలోని వెంకట్రాయిని చెరువుపై వీర్నపల్లి, కంచర్ల గ్రామాల మధ్య వివాదం కొనసాగుతోంది. చెరువులోని నీరు తగ్గడంతో చేపల కోసం గిరిజనులు, మత్స్యకారుల సంఘం సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తాజాగా 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం చెరువులో చేపలు పట్టేందుకు గిరిజనులు రాగా వీరిని అడ్డుకునేందుకు కంచర్ల గ్రామస్తులు వచ్చారు. దీంతో ఇరువురి మధ్య గొడవ తలెత్తింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చెదరగొట్టారు. బావుల్లో చేపలను గిరిజనులు పట్టుకోగా.. కంచర్ల ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన పలువురు జేసీబీ సాయంతో చెరువులోని నీటిని పూర్తిగా తొలగించారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశాలున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి చెరువుల్లో నీటిని నింపుతుండగా ఇలాంటి ఘటనలు కలవరపెడుతున్నాయి.


చెరువులోని నీటిని తొలగిస్తున్న గ్రామస్తులు

కుండపోయి.. బాటిల్ వచ్చే..

గౌడ కులస్తులు తాటి చెట్లకు కుండలు కడతారు.. కానీ రోజులు మారుతున్నాయి. కుండలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లను కట్టారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంలలో రోడ్డు పక్కన ఇలా తాటి చెట్లకు బాటిళ్లు కట్టిన దృశ్యం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది.
- వేములవాడరూరల్

